క్లుప్తంగా

ఎంపీ నగేశ్‌ను కలిసిన జెడ్పీటీసీ



పుష్పగుచ్ఛం ఇస్తున్న జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్‌: ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను గురువారం హైదరాబాద్‌లో బీజేపీ నాయకుడు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా ఆదిలాబాద్ ఎక్స్ రోడ్ నుంచి ఆదిలాబాద్ వరకు నాలుగు వరుసల రహదారిని చేపట్టేలా కృషి చేయాలని కోరారు.

అట్రాసిటీ కోర్టు ఏర్పాటుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు ఏర్పాటుకు కృషి చేయాలని సీనియర్ న్యాయవాది బోనగిరి సతీశ్‌బాబు కోరారు. ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం న్యాయవాదుల ఆహ్వానం మేరకు బార్ అసోసియేషన్ హాల్‌కు వచ్చారు. ఎస్పీకి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. న్యాయవాదులు సత్యశ్రీలత, విద్యాసాగర్, చరణ్‌తేజ, సంజీవ్ పాల్గొన్నారు.

స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్‌: పట్టణంలోని ప్రధాన చౌరస్తాల్లో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ చౌరస్తా, లారీ చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తాలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్పీడ్‌బ్రేకర్లు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అవసరంలేని చోట సర్‌సిల్క్‌కి వెళ్లే రోడ్డుకు 500 మీటర్లకు గాను 10 స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేశారని, అవసరం ఉన్న చోట వదిలేశారన్నారు. ప్రధాన చౌరస్తాల్లో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. నాయకులు చాపిలె సాయికృష్ణ పాల్గొన్నారు.

వర్షం కోసం కప్పతల్లి ఆట



ఆసిఫాబాద్‌రూరల్‌: మండలంలోని బూర్గుడ గ్రామ రైతులు వర్షం కోసం గురువారం కప్పతల్లి ఆటలు ఆడారు. వర్షం రాకపోవడంతో చేనులో నాటిన పత్తి గింజలు చెడిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వందల ఎకరాల్లో గింజలు మొలకెత్తని పరిస్థితి ఉందని, అందుకే కప్పతల్లి ఆటలతో దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

నీటి సౌకర్యం ఏర్పాటు

కాగజ్‌నగర్‌రూరల్‌: కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలో గల సాయిచరణ్ మోక్షదాంకు మంచినీటి కనెక్షన్‌ను గురువారం ఏర్పాటు చేశారు. అక్కడ తాగునీటి సమస్య తలెత్తడంతో పలువురు మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కౌన్సిల్ సభ్యులు ఎస్పీఎం సౌజన్యంతో నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. కౌన్సిలర్లు విజయ్‌యాదవ్, యెల్లేశ్, శివప్రసాద్, నాయకులు కీర్తి శ్రీనివాస్, ఎస్పీఎం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు యోగా దినోత్సవం

వాంకిడి: మండలంలోని సరాండి వెళ్లేదారి వద్ద గల కాలువ సమీపంలోని యోగా సెంటర్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు మాస్టర్ దొడ్డాజీ తెలిపారు. ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు నిర్వహించే కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు.

‘నానో’పై విముఖత

- రైతులకు అవగాహన కరువు
- ఇప్పటికీ ఎరువుల బస్తాలపైనే నమ్మకం



నానో, సాధారణ ఎరువుల గురించి రైతులకు వివరిస్తున్న వ్యాపారి

కెరమెరి: వ్యవసాయ రంగంలో సాగు ఖర్చులను తగ్గించి, అధిక దిగుబడులను సాధించేందుకు కాలక్రమేణా విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాగుచేపడితే లాభదాయకంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అన్నదాతలు మూస ధోరణిలోనే వెళ్లడం వల్ల నష్టాలను చవిచూస్తున్నారనేది వాస్తవం. ముఖ్యంగా రైతులు తక్కువ ధర ఉండే నానో ఎరువులు వాడితే ఖర్చు తగ్గి దిగుబడులు పెరుగుతాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఈ తరుణంలో ఎరువులు, కూలీలకు రైతులు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం మొదటగా నానో యూరియా(లిక్విడ్), ఆ తర్వాత డీఏపీని అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం దీన్ని మార్కెట్లోకి తీసుకొచ్చినా..వినియోగంపై రైతులకు ఇంకా అవగాహన లేదు. ఎలా వినియోగించాలనే దానిపై రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలి. మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉండగా.. 9194 మంది రైతులు ఉన్నారు. ఇందులో 29,456 ఎకరాల్లో పంటలు సాగు చేస్తుండగా.. 26,140 ఎకరాల్లో పత్తి పండిస్తున్నారు.

ఎన్నో ప్రయోజనాలు..

నానో ఎరువుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. సాధారణంగా యూరియా బస్తా వేస్తే 30 శాతం పంటకు అందుతుంది. నానో యూరియా వినియోగిస్తే 80 శాతం అందుతుంది. అర లీటర్ సీసాలో లభించే నానో యూరియా 45 కిలోల యూరియా బస్తాతో సమానం. రాయితీ పోను యూరియా బస్తా ధర రూ.266 ఉండగా.. నానో యూరియా లీటర్ రూ.240కే లభ్యమవుతుంది. సాధారణంగా ఎకరాకు అర లీటరు నానో యూరియా సరిపోతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. యూరియా తర్వాత నానో డీఏపీని అందుబాటులోకి తెచ్చారు. బస్తా డీఏపీకి 500 మిల్లీ లీటర్ల నానో డీఏపీ సీసాతో సమానం. బస్తా డీఏపీ ధర రూ.1350 ఉండగా.. నానో డీఏపీ రూ.600కే లభిస్తుంది. కాగా, రైతులు బురద పొలంలోకి వెళ్లి వేయాలంటే అసహనం వ్యక్తం చేస్తున్నందున వీటిని కొనుగోలు చేయడం లేదని స్థానిక షాపుల యజమానులు చెబుతున్నారు.

నమ్మకం కుదరడం లేదు



గత రెండేళ్లగా నానో యూరియాను విక్రయిస్తున్నాం. రైతులకు ఇంకా దీనిపై నమ్మకం కుదరడం లేదు. నానో యూరియా, డీఏపీపై అవగాహన కల్పిస్తున్నాం. గుళికల ఎరువులకు అలవాటుపడ్డ రైతులు ఒకే సారి మారాలంటే కొంత కష్టంగా ఉంది.

– గిత్తే గణేశ్, వ్యాపారి, కెరమెరి

అవగాహన కల్పిస్తున్నాం



సాధారణ యూరియా వాడకం కన్నా నానో యూరియా వాడకం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. నానో యూరియ, డీఏపీ సీసాలు మార్కెట్లో లభిస్తాయి. వాటి వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇటీవల జరిగిన అవగాహన సదస్సుల్లో ఈ విషయాలను రైతులకు క్లుప్తంగా వివరించాం.

– ఎస్ గోపీకాంత్, ఎంఏఈవో, కెరమెరి

నిందితులను శిక్షించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న నాయకులు

జైనూర్: పార్లమెట్ ఎన్నికల సమయంలో ఆదివాసీ, దళిత యువకులతోపాటు వడ్డెర కాలనీ ప్రజలపై కర్రలు, మరణాయుధాలతో దాడికి దిగిన నిందితులను కఠినంగా శిక్షించాలని గురువారం జైనూర్ మండల కేంద్రంలోని రహదారిపై ఆదివాసీ అనుబంధ సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు రాస్తారోకో చేపట్టారు. రాస్తారోకో కారణంగా రహదారిపై గంటకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కనక యాదవ్‌రావు మాట్లాడుతూ దాడికి పాల్పడిన ఓ వర్గం వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యానేరం కింద కేసు నమోదు చేయాల్సిన అధికారులు నామమాత్రంగా కేసు నమోదు చేయడం సరికాదన్నారు. అవగాహన లేకుండా ఆదివాసీ చట్టాలను కాలరాయడంపై మండిపడ్డారు. గాయపడిన ఆదివాసీ యువకుడు మర్సుకోల లక్ష్మణ్‌కు రూ.10లక్షల పరిహారంతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదిరోజుల్లో డీఎస్పీపై శాఖపరమైన చర్యలు తీసుకోకపోతే కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆత్రం భీంరావు, చహక్కటి గణేశ్, తొడసం ధర్మారావు, సుభోద్‌కాంత్, శివరాజ్ పాటిల్ సింధే, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయించొద్దు



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆసిఫాబాద్‌అర్బన్‌: రైతులు అధికంగా విని యోగించే ఎరువులను మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించొద్దని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో గురువారం సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్‌లో విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయించే వారిపై వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో సహకార సంఘం ఆధ్వర్యంలో యూరి యా పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏవో ఖాదర్ హుస్సేన్, నాయకులు పెంటయ్య, మధుకర్, నారా ఆశన్న, బాపురావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

రెబ్బెన: మండల కేంద్రంలోని టీజీబీలో ఫీల్డ్ అధికారిగా పనిచేసి పదోన్నతిపై వెళ్తున్న నరేశ్‌ను జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, బ్యాంకు అధికారులు గురువారం సన్మానించారు. బ్యాంకు మేనేజర్ శాస్త్రీ, కాంగ్రెస్ నాయకులు రవి, పర్వతి సాయి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారిద్దాం



ఆసిఫాబాద్‌రూరల్‌: పిల్లలకు మాత్రలు వేస్తున్న ఎంపీపీ మల్లికార్జున్



కెరమెరి: సుర్దాపూర్ పాఠశాలలో..



జైనూర్: మాత్రలు వేస్తున్న వైద్యాధికారి

- విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఆసిఫాబాద్‌రూరల్‌: నులి పురుగుల నివారిద్దామని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని చిర్రకుంట పాఠశాల విద్యార్థులకు గురువారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఈ మాత్రలు వేయాలన్నారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు అందచేశారు. నులిపురుగుల వల్ల కలిగే అనర్థాలను వైద్యసిబ్బంది వివరించారు. డా. అర్షిన్, ఎంపీడీవో అలర్ట్, ఎంపీవో గంగాసింగ్, హెచ్ఎం విజయనిర్మల, ఉపాధ్యాయులు, యాదగిరి, ప్రియాంక, అర్షియా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జూర్: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఎంపీటీసీ పర్వీన్ సుల్తాన, పంచాయతీ కార్యదర్శి తుకారాం, ఏఎన్ఎంలు సుమలత, మేఘన, ఆశ కార్యకర్త వైశాలి, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, అంగన్‌వాడీల్లో విద్యార్థులకు గురువారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి క్రాంతి కిరణ్ తెలిపారు. మొత్తం 9342 మంది విద్యార్థులు, చిన్నారులు ఉండగా..5371 మందికి మాత్రలు అందించినట్లు పేర్కొన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ సూర్యకాంత, హెచ్ఏలు వసంత్, శంకర్, ఏఎన్ఎంలు ఉన్నారు.



కౌటాల: కేజీబీవీలో..



పెంచికల్‌పేట్: విద్యార్థినికి మాత్ర వేస్తూ..

కౌటాల: మండలంలోని అంగన్‌వాడీలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు అల్బెండజోల్ మాత్రలు వేశారు. కేజీబీవీలో ఎస్ఓ పవిత్ర మాత్రలు వేశారు. ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. మండల వైద్యాధికారి జితేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తదితరులు ఉన్నారు.

నత్తనడకన..

- దేవులగూడ–రేకులగూడ బీటీ రోడ్డు
- కంకర పోసి వదిలేసి..
- ప్రజలు, వాహనదారుల రాకపోకలకు ఇక్కట్లు



దేవులగూడ-రేకులగూడ రోడ్డు

రెబ్బెన: మండలంలోని గోలేటి గ్రామం ఏర్పడి వందేళ్లు దాటినా ఇప్పటికి మెరుగైన రోడ్డు సౌకర్యం లేదంటే అతిశయోక్తి కాదు. మేజర్ పంచాయతీ, జనాభా, చుట్టూ అవాస గ్రామాలైన ఇన్నాళ్లుగా ప్రభుత్వం రోడ్డును నిర్మించలేదు. గోలేటి పరిధిలో సోనాపూర్, గోండుగూడ, దుర్గాపూర్, గోలేటి విలేజ్, భగత్‌సింగ్‌నగర్, దుబ్బగూడ ఉండగా, కైరిగూడ పరిధిలో కైరిగూడ, కైరిగూడ తండాలు ఉన్నాయి. ఇప్పటికి గోలేటితోపాటు కైరిగూడ గ్రామాల ప్రజలు సింగరేణి యాజమాన్యం తమ అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్న రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నారు. గోలేటి నుంచి రెబ్బెన వరకు గొండుగూడ నుంచి దేవులగూడ రోడ్డును గత పాలకులు పట్టించుకోలేదు. గోలేటి, కైరిగూడ వాసులు సింగరేణి రోడ్డు ద్వారా మండల కేంద్రానికి వెళ్లేందుకు 6.5 కి.మీ ప్రయాణించాల్సి వస్తోంది. గోలేటి మీదుగా దేవులగూడ సమీపం గుండా రెబ్బెనకు 3.5 కి.మీలో చేరుకోవచ్చు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో..

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో దేవులగూడ నుంచి రేకులగూడ వరకు బీటీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. హైలెవల్ వంతెన వద్ద బ్రిడ్జికి రెండువైపులా బీటీ పూర్తి చేయాల్సి ఉంది. దారి మధ్యలో కల్వర్టుల నిర్మాణం పూర్తయినా బీటీ అసంపూర్తిగా మారింది. రోడ్డుపై కంకరపోయడంతో రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. రేకులగూడ వద్ద మరో 300 మీటర్ల వరకు రోడ్డు నిర్మాణంతోపాటు కల్వర్టు పనులు చేపట్టాల్సి ఉంది. అటువైపు ఉన్న పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

బీటీ మంజూరుకు ప్రతిపాదనలు

ప్రజలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించేందుకు పోలీస్‌శాఖ ముందుకొచ్చింది. దేవులగూడ నుంచి రేకులగూడ వరకు బీటీ రోడ్డు మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. రూ.6.6 కోట్లతో 3.2 కి.మీ మేర బీటీతోపాటు హైలెవల్ వంతెన మంజూరు చేసింది. గత సంవత్సరమే బ్రిడ్జి, రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. బ్రిడ్జి పనులు దాదాపు పూర్తయ్యాయి.

పనులు పూర్తి చేయాలి



దేవులగూడ నుంచి రేకులగూడ వరకు నిర్మిస్తున్న బీటీ పనులు పూర్తి చేయాలి. కంకర పోసి నెలలు గడుస్తున్నా బీటీ వేయడం లేదు. రేకులగూడ వద్ద రోడ్డు పనులు పూర్తి చేస్తే రైతులకు ఉపయోగరంగా ఉంటుంది.

– రాయిల్ల నర్సయ్య, రమణారెడ్డి నగర్

దూరం తగ్గుతుంది



గోలేటి నుంచి రెబ్బెనకు వెళ్లాలంటే సింగరేణి రోడ్డు ద్వారా వెళ్తున్నాం. ప్రభుత్వం మెరుగైన రోడ్డు నిర్మించలేదు. గొండుగూడ మీదుగా రెబ్బెన ఉన్న రోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తున్నారు. అది పూర్తయితే గోలేటి నుంచి రెబ్బెనకు దూరభారం తగ్గుతుంది.

– వసంత్‌రావు, గోలేటి

వారం రోజుల్లో పూర్తి

దేవులగూడ రేకులగూడ రోడ్డు పనులు నడుస్తున్నాయి. కేవలం బీటీ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రోడ్డుపై పోసిన కంకర కాస్త దెబ్బతింటే దాన్ని సరిచేయిస్తున్నాం. వారం రోజుల్లో పనులు పూర్తి చేసి బీటీ వేయిస్తాం. రేకులగూడ వద్ద పెండింగ్‌లో ఉన్న రోడ్డు, కల్వర్టు పనులు త్వరలో పూర్తి చేస్తాం.

– కిరణ్‌కుమార్, ఏఈ, ఆర్అండ్‌బీ



పాఠశాల.. డంప్‌యార్డా ?

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఒకే ఆవరణలో ఉన్నాయి. సెలవుల అనంతరం పాఠశాల పునఃప్రారంభం ముందు పారిశుధ్య పనులు నిర్వహించాల్సి ఉంది. కాని ఇక్కడ ఎలాంటి పనులు చేపట్టలేదు. చెత్త, పేడ కుప్పలు, మద్యం సీసాలు, రాళ్ల కుప్పలతో దర్శనమిస్తున్నాయి. డంప్‌యార్డ్ పాఠశాల అన్నవిధంగా తయారైంది. వర్షం కురిసినప్పుడు దుర్వాసన వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయంపై హెచ్ఎం మురళితో మాట్లాడగా పారిశుధ్య పనులు చేపట్టామని పంచాయతీ వారికి తెలియజేసి మళ్లీ నిర్వహిస్తామని చెప్పడం గమనార్హం.



వాహనదారులూ జర జాగ్రత్త!

చింతలమానెపల్లి: వర్షాకాలం మొదలైంది. ఇళ్లలో నీరు రాకుండా యజమానులు ఇంటికి ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తారు. పంటల సాగుకు ట్రాక్టర్లు రోడ్డు గుండా వెళ్తున్నాయి. ఈక్రమంలో మట్టి రహదారులపై చేరుతోంది. వర్షాలు కురిసినప్పుడు ద్విచక్రవాహనాలు జారి కిందపడి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. మండలంలోని దబ్బా క్రాస్‌రోడ్‌లో ప్రధాన రహదారిపై మట్టి చేరి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాల్సిన అవసరం ఉంది.

ఎస్పీఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

కాగజ్‌నగర్‌రూరల్‌: జేకే గ్రూపు వ్యవస్థాపకుడు హరిశంకర్ సింఘానియా జన్మదినం సందర్భంగా ఎస్పీఎం మిల్లు యాజమాన్యంలో హెచ్ఆర్‌డీ హాల్‌లో గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో 150 మంది కార్మికులు, ఉద్యోగులు పాల్గొని రక్తదానం చేశారు. వైస్‌ప్రెసిడెంట్ ఏకే మిశ్రా, సీజీఎం సురేందర్ బియాని, జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి, డాక్టర్ నయీం హైమద్‌ఖాన్, ప్రతినిధులు గిరీష్‌రాయ్, రమేశ్‌రావు, నాగరాజు, భానుప్రకాశ్, శశికాంత్, నాగేశ్వర్‌రావు రమేశ్, కమల్ లోయా, ప్రవీన్, రెడ్‌క్రాస్‌సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

జైతూర్ దేవుడికి పూజలు

రెబ్బెన: మండలంలోని తుంగెడలో జైతూర్ దేవుడికి గ్రామస్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. రైతులందరూ సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుడిని వేడుకున్నారు.